క్లుప్తంగా

పోర్టు స్టేడియంలో నర్సింగ్ రూమ్ ఏర్పాటు



నర్సింగ్ రూమ్ ప్రారంభిస్తున్న వైజాగ్ ఆల్ఫా లేడీస్ సర్కిల్ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఆల్ఫా లేడీస్ సర్కిల్(వీఏఎల్‌సీ–174) ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం ఫన్ జోన్‌లో స్తన్యపానానికి ప్రత్యేకంగా ఒక నర్సింగ్ యూనిట్(రూమ్)ను ఏర్పాటు చేశారు. దీనిని శనివారం సర్కిల్ ప్రతినిధులు ప్రారంభించి మాట్లాడారు. సాధారణ ప్రజల వినియోగానికి ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. కొత్త తల్లులు సౌకర్యంగా, ఉచితంగా తమ పిల్లలకు స్తన్యపానం కొనసాగించేందుకు నర్సింగ్ రూమ్ ఉపయోగపడుతుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులపై జీవీఎంసీ సిబ్బంది అవగాహన కల్పించారు. వీటిని నివారించాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రతి శుక్రవారం ఇళ్ల వద్ద డ్రైడే అమలు చేయాలని విద్యార్థులకు వివరించారు. సచివాలయం, జీవీఎంసీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో శనివారం ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. 14వ వార్డుకు చెందిన పలువురికి సుమారు రూ.4.67 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా.. ఆస్పత్రిలో చూపించుకున్న వారి ఒరిజినల్ బిల్లులను తన కార్యాలయంలో అందజేస్తే వారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్యామల దీపిక, పృథ్వీరాజ్, డాక్టర్ ఎస్.ఇ.కె.అప్పారావు, సురేష్, ధర్మారావు, ఇ.కృష్ణారావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐను ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో బీపీ, సుగర్ పరీక్షలతోపాటు శరీర సమస్యలపై వైద్య పరీక్షలు చేస్తారన్నారు. వాసన హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మురళీనగర్ పరిసర ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లలితా పీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమం



భద్రకాళి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అమావాస్య సందర్భంగా ఆదిపరాశక్తి అనుగ్రహం పొందేందుకు శనివారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు శుభ ఫలితాల కోసం లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సీతమ్మధార కంగారు కిడ్స్ స్కూల్ పక్క లైన్‌లో కంకర తేలిన రోడ్డు



క్షత్రియ కల్యాణ మండపం డౌన్‌లో రోడ్డు దుస్థితి

అధ్వాన రోడ్లపై అవస్థల ప్రయాణం



నక్కవానిపాలెంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

- సీతమ్మధార, నక్కవానిపాలెం ప్రాంతాల్లో తవ్వి వదిలేసిన రహదారులు
- నెలలు గడుస్తున్నా.. కానరాని మరమ్మతులు
- కొన్ని చోట్ల కంకర వేసి వదిలేసిన వైనం
- తంటాలు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు



నక్కవానిపాలెం ఏఎంజీ హాస్పిటల్ పక్క లైన్‌లో తవ్వి వదిలేసిన రహదారి

తాటిచెట్లపాలెం: నగరం నడిబొడ్డున గల పలు ప్రాంతాల రహదారులు దారుణంగా మారాయి. ఇటువంటి అధ్వాన రోడ్లపై నిత్యం అవస్థలు పడుతూ జనం ప్రయాణించాల్సి వస్తోంది. రోజులు, వారాలు కాదు.. నెలలు గడుస్తున్నా తమ ప్రాంతంలోని రోడ్లు బాగవడం లేదని స్థానికులు ఎదురుచూస్తున్నారు. జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్, నక్కవానిపాలెం ప్రాంతాల్లో చాలా చోట్ల పైప్‌లైన్, యూజీడీ పనుల నిమిత్తం రహదారులను తవ్వారు. ఇక్కడ పనులు ప్రస్తుతానికి పూర్తయినా రోడ్లను మాత్రం అలానే వదిలేశారు. దీంతో ఈ ప్రాంతాల్లో ప్రయాణించే వారు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొనసా...... గుతున్న పనులు

సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో 24/7 మంచినీటి పనుల నిమిత్తం ప్రతి రోడ్డును తవ్వి వదిలేశారు. ఇక్కడ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఒక ప్రాంతంలో పూర్తయ్యాక మరో చోట పనులు చేసినా బాగుండేది. మొత్తం అన్ని చోట్ల ఒకేసారి తవ్వేయడంతో ఎటువైపు ప్రయాణాలు సాగించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు.

సీతమ్మధారలోని కంగారు కిడ్స్ స్కూల్, క్షత్రియ కల్యాణ మండపం, నక్కవానిపాలెం ఏఎంజీ హాస్పిటల్ పక్కన రోడ్డు మధ్యలో యూజీడీ పనుల నిమిత్తం తవ్వారు. అవి పూర్తయ్యాక.. తవ్విన చోట గ్రావెల్ (నల్ల కంకర) వేసి వదిలేశారు. ఈ ప్యాచ్ వర్క్‌లను పూర్తి చేయలేదు. ఈ ప్రాంతంలో చాలా కాలం నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో కంకర రాళ్లు రోడ్డంతా విస్తరించి, మట్టి రోడ్డు కంటే దారుణంగా తయారైంది. రోడ్డుపై నడవడానికి కూడా వీల్లేకుండా రాళ్లు వ్యాపించాయి. తమ ప్రాంతంలో కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉందని, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించి రహదారులను బాగుచేసి ఇక్కట్లు తొలగించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

> **రహదారులు బాగుచేయాలి**
>
> సీతమ్మధార ప్రాంతంలో పలు చోట్ల రహదారులను తవ్వి వదిలేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఏవేవో పనుల నిమిత్తం రోడ్లను తవ్వేస్తున్నారు. రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి తవ్వి వదిలేసిన రోడ్లను తక్షణం బాగుచేసేలా చర్యలు తీసుకోవాలి.
>
> – సిహెచ్.సంతోష్‌కుమార్, సీతమ్మధార

రోడ్డంతా గుంతలు.. పాలకుల కళ్లకు గంతలు



కంచరపాలెం - తాటిచెట్లపాలెం రహదారిలో గోతుల వద్ద ప్రమాద సూచికగా ఏర్పాటు చేసిన చెట్టు కొమ్మలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం కూడలి బీఆర్‌టీఎస్ రహదారి నుంచి తాటిచెట్లపాలెం వీఐపీ రోడ్డుకు వెళ్లే మార్గం గుంతలమయంగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు మరింతగా కుదించుకుపోయాయి. రహదారిలో భారీ గోతుల వల్ల ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు చెబుతున్నారు. రహదారిలో భారీ గుంతలు ఏర్పడిన చోట ప్రమాద సూచికగా బండరాళ్లు, చెట్టు కొమ్మలకు ఎర్రని గుడ్డలు కట్టి ఏర్పాటు చేసుకుని నిత్యం భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నట్లు స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన గోతులు పూడ్చి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సృజనాత్మక బోధనతోనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న మాజీ వీసీ ఆచార్య వెంకట సుబ్బయ్య



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, పాలిటెక్నిక్ అధ్యాపకులు

మురళీనగర్: పాలిటెక్నిక్ అధ్యాపకులు సృజనాత్మక ఆలోచనలతో కూడిన బోధన చేయాలని విజయనగరం జేఎన్‌టీయూ మాజీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని 'డిజైన్ థింకింగ్‌లో న్యూమరికల్ అప్రోచ్' అనే అంశంపై మాట్లాడారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను పాఠ్యాంశాలకు అనువర్తిస్తూ విద్యార్థులకు నూతన సాంకేతిక విధానాన్ని పరిచయం చేయాలన్నారు. సైంటిస్ట్ డాక్టర్ వి.రామకృష్ణ మాట్లాడుతూ సముద్ర నావికాదళంలో ఉపయోగించే ప్రొపెల్లర్ల రూపకల్పన, పనితీరు, నియంత్రణలో సంఖ్యా విశ్లేషణ కీలకమని వివరించారు. కంప్యూటేషనల్ మోడల్స్, హైడ్రో డైనమిక్ టెస్టింగ్, శబ్ద నియంత్రణ వంటి అంశాలను తెలిపారు. సముద్ర రక్షణ, అండర్ వాటర్ వెహికల్స్, శక్తి సామర్థ్యం పెంపులో ఈ పరిశోధనలు ఎంతగానో ఉపయుక్తమని పేర్కొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్, శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్స్ ఎం.హరిబాబు, విక్టర్ పాల్, కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.రాజు, కో–కో ఆర్డినేటర్ ఎం.భరణి పాల్గొన్నారు.

వైభవుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు విశేష సేవలు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


మట్టి వినాయక విగ్రహాలే మేలు



విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలు అందిస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ ట్రస్టు చైర్‌పర్సన్ కుప్పిలి కీర్తి పట్నాయక్ పిలుపునిచ్చారు. 50వ వార్డు కార్యాలయం వద్ద ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం స్థానికులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ మట్టి వినాయకుడిని పూజించాలని సూచించారు. స్థానికులతో పాటు విద్యార్థులకు 500 విగ్రహాలను కీర్తి అందించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి.సుధాకర్, జీవీఎస్ మూర్తి, సూపర్‌వైజర్లు పి.చిరంజీవి, జి.గణేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రఘు, రాజు, సచివాలయం శానిటరీ కార్యదర్శులు వెంటలక్ష్మి, రేష్మ, ట్రస్టు సభ్యులు టీవీ చారి, రవికుమార్ పాల్గొన్నారు.

5 వేల మందితో సంఘమిత్ర సేవా సైన్యం



మాట్లాడుతున్న సంఘమిత్ర సూరిబాబు

సీతంపేట: ప్రజలకు సేవలందించడమే పరమావధిగా 5 వేల మందితో సంఘమిత్ర సేవా సైన్యం తయారు చేసినట్టు సంఘమిత్ర సూరిబాబు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సాయంత్రం సంఘమిత్ర సూరిబాబు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, విజయాలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏళ్లుగా ఏ ఒక్కరి వద్ద రూపాయి తీసుకోకుండా 18 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రూపాయికే విద్య, ఖైదీలకు వృత్తి విద్యలో శిక్షణ, ప్రజా చైతన్యరథాలు, సేవలు చేస్తున్న వారిని సత్కరించడం, పేదలకు వస్త్రాల పంపిణీ, ట్రాఫిక్‌పై అవగాహన, వైద్య సహాయం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రానున్న కాలంలో మరో 11 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ నేటి తరానికి సంఘమిత్ర సూరిబాబు ఆదర్శంగా నిలుస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తనకున్న పరిధిలో సేవాభావం, ఆధ్యాత్మిక భక్తిభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి బి.కె.రామేశ్వరి, యువసేన ఫౌండేషన్ అధ్యక్షుడు హరి, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఎకనా ప్రెన్యూర్స్ ఫెస్ట్–2025

కంచరపాలెం: ప్రపంచ వ్యాపారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎకనా ప్రెన్యూర్స్ ఫెస్ట్–2025ను శనివారం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వ్యాపారవేత్త సరిత పాల్గొని మాట్లాడారు. పలు సాంస్కృతిక పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ మంగవేణి, రమణీలత, వసంత, గాయిత్రి, మౌసమి, పావని, యోజన, డాక్టర్ పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు సభ్యత్వం స్థానికులకే ఇవ్వాలని డిమాండ్



వైభవుడి ఆలయం వద్ద ధర్నా చేస్తున్న ఎన్‌జీజీవోస్ కాలనీ సంఘం సభ్యులు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా కాలనీ సంఘం సభ్యులనే నియమించాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం ఆలయం ఎదుట స్థానికులు ధర్నా చేశారు. గత పాలకులు, ఎండోమెంట్ అధికారులు, ప్రస్తుత ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కాలనీ వాసులకు ఇచ్చిన హామీ మేరకు దేవదాయ శాఖ ఏర్పాటు చేయనున్న ట్రస్ట్ బోర్డులో కాలనీ వాసులకే సభ్యులుగా స్థానం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్‌జీజీవోస్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వి.పార్వతీశ్వరరావు, పి.బలరామస్వామి, కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

27 నుంచి దుర్గాగణపతి నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈవో రమాభాయి, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: సీతంపేటలో కొలువైన దుర్గాగణపతి ఆలయంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జి.వి.రమాభాయి, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. ఉత్సవాల ప్రచార పత్రాలను శనివారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడు కళాకారులచే నవరాత్రుల్లో ప్రతి రోజూ సాయంత్రం రోజుకొక అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. 27వ తేదీ చవితి రోజున వెండి కవచంలో నిజరూప దర్శనం, 28న వాణి గణపతి, 29న లక్ష్మీగణపతి, 30న విష్ణు గణపతి, 31న ఆదిత్య గణపతి, సెప్టెంబర్ 1న శివబాల గణపతి, 2న స్కంద గణపతి, 3న త్రిముఖ గణపతి, 4న అర్ధనారీశ్వర గణపతి అలంకారంలో స్వామివారిని అలంకరిస్తామని చెప్పారు. 5వ తేదీ సాయంత్రం మేళతాళాలు, సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలతో సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 10న మధ్యాహ్నం ఆలయం వద్ద 10 వేల మంది భక్తులకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు. 9 రోజులు తమ గోత్ర నామాలతో సహస్ర నామార్చన చేసుకోదలచిన భక్తులు రూ.300 చెల్లించి దుర్గాగణపతి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నటరాజన్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు ప్రశంసనీయం



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించిన యోధుడు, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. టంగుటూరి 153వ జయంతి సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైమన్ కమిషన్‌ను ఎదిరించి ఆంధ్ర కేసరిగా గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి టంగుటూరని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ విద్యావేత్తగా, న్యాయవాదిగా, పత్రికా సంపాదకుడిగా టంగుటూరి సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బాబాపూ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంతర్వేది, రమణి, హుస్సేన్, చాట్ల బాబూరావు, గాంధీ సెంటర్ కార్యదర్శి రామారావు, గార సత్యనారాయణ, కరుణ, సత్యవతి పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌తో బీవోబీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వాల్తేర్ డివిజన్, బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌తో బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) రీజనల్ ఆఫీస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలోని డీఆర్‌ఎం సమావేశ మందిరంలో శనివారం ఒప్పంద పత్రాలపై డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూల సమక్షంలో వాల్తేర్ డివిజన్ తరఫున సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారి, బ్యాంక్ ఆఫ్ బరోడా తరఫున విశాఖపట్నం రీజియన్, డిప్యూటీ జనరల్ మేనేజర్, రీజనల్ హెడ్ లీనా గోహైన్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం వాల్తేర్ డివిజన్ శాశ్వత ఉద్యోగులకు బరోడా గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజీని అందించనుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వాల్తేర్ డివిజన్ ఉద్యోగులు ప్రత్యేకమైన వేతన ఖాతా ప్రయోజనాలు, ఆధునిక బ్యాంకింగ్ సౌకర్యాలు, విలువ ఆధారిత ఆర్థిక సేవలకు అర్హులవుతారు. ప్రభుత్వ సంస్థలకు మద్దతు ఇవ్వడంలో, వేతన ఉద్యోగుల ఆర్థిక అవసరాలను తీర్చడంలో బ్యాంక్ ఆఫ్ బరోడా నిబంధనలను ఈ ఒప్పందం స్పష్టంగా తెలియజేస్తుందని బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు.

పీసీఆర్ ఆధారిత పద్ధతులపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రొఫెసర్ రామారావు తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయోకెమిస్ట్రీ – బయోటెక్నాలజీ విభాగాలు శనివారం పీసీఆర్ ఆధారిత పద్ధతులపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించాయి. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి గీతం డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మల్లా రామారావు ప్రారంభించారు. విద్యార్థుల సమయ నిర్వహణ, విజయ రహస్యాల గురించి ప్రస్తావించారు. సుమారు 8 కళాశాలల నుంచి 120 మంది విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గని ప్రతిభ చూపారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ పి.కె. జయలక్ష్మి, కన్వీనర్ మౌసమి శంకర్ అడ్డాల, డాక్టర్ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితం.. పర్యావరణ హితం



నరేంద్రనగర్‌లో గెడ్డను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది



సీతంపేటలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విడనాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు



సీతమ్మధార రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న సచివాలయం, జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ వార్డుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 43వ వార్డు నరేంద్రనగర్‌లో గెడ్డలను శానిటేషన్ సిబ్బంది శుభ్రం చేశారు. 25వ వార్డు సీతంపేట కూడలిలో ఎండింగ్ టు ది ప్లాస్టిక్ పొల్యూషన్ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా క్లాత్, పేపర్ బ్యాగులు, గాజు, స్టీలు పాత్రలు వాడాలను సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడమని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, సారిపిల్లి గోవింద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అప్పారావు, సత్యం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

తాటిచెట్లపాలెం: సీతమ్మధార రైతుబజార్‌లో రైతులకు జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది ప్లాస్టిక్ కవర్లపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని, గుడ్డ, నార సంచులు వాడాలని సూచించారు. రైతులు ఎవరి స్టాళ్లను వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి డస్ట్‌బిన్లలో వేయాలన్నారు.